యాదగిరిగుట్టలో వైభవంగా నిత్య తిరుకల్యాణోత్సవం

ఆలయం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 19 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు చేపట్టారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.20,05,452 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

మండల ప్రజలకు ఉచిత గర్భాలయ దర్శనం

యాదగిరిగుట్ట పట్టణంతోపాటు మండలానికి చెందిన ప్రజలకు స్వామివారి ఉచిత గర్భాలయ దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ప్రతి మంగళవారం ఉదయం 8:15 నుంచి 9గంటల వరకు, ప్రతి శనివారం ఉదయం 7నుంచి 9గంటల వరకు స్వయంభూ పంచనారసింహస్వామిని గర్భాలయంలో దర్శించుకునే వీలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు తప్పనిసరిగా సాంప్రదాయ వస్త్రాలు ధరించడంతోపాటు ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు.

ఇష్టారాజ్యంగా ఆలయ సిబ్బంది వ్యవహారం

అధికార పార్టీ నాయకుడు తీసుకువచ్చిన భక్తులను లోపలికి పంపిస్తున్న ఆలయ సిబ్బంది

యాదాద్రి దేవస్థాన సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణ భక్తులకు కృత్రిమంగా ఇక్కట్లు క్రియేట్ చేస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం 4గంటల నుంచి బ్రేక్ దర్శనం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో పది నిమిషాలు ముందుగానే ఉచిత దర్శనాలను బంద్ చేస్తారు. కానీ.. శనివారం మధ్యాహ్నం 3:50గంటలకు ఉచిత,150 రూపాయల దర్శనాలు బంద్ చేసి గేట్లకు తాళాలు వేశారు. 3:50 గంటల తరువాత వచ్చిన భక్తులను తిరిగి పంపించారు. ఇంతలో అధికార పార్టీ నాయకుడు భక్తులను తీసుకుని రాగానే అన్ని గేట్లు తెరిచి ప్రత్యేక దర్శనం కల్పించారు. దాంతో భక్తులు ఆశ్చర్యపోయారు. నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

తండ్రిని కోల్పోయిన చిన్నారులకు ఉచిత విద్య

మోత్కూరు, అక్టోబర్ 19 : మోత్కూరులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల యాజమాన్యం నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందజేయడానికి ముందుకొచ్చింది. ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన ముత్యాల కుమార్ డ్రైవర్‌గా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దాంతో వారి కుటుంబం వీధిన పడింది. ఆ కుటుంబానికి పాఠశాల యాజమాన్యం అండగా నిలిచింది. బాల్యం దశలో ఉన్న వారి పిల్లలు రుత్విక్, సాత్వికను ఇంటర్మీడియట్ వరకు చదివించి తోడ్పాటునందిస్తామని భరోసా కల్పించారు. చిన్నారులు రుత్విక్, సాత్వికకు పాఠశాల కరస్పాండెంట్ విజయామరియన్న అభినందనలు తెలిపారు. అనంతరం వారికి యూనిఫామ్, పుస్తకాలు అందించి పాఠశాలలో చేర్చుకున్నారు. తమ పిల్లలకు విద్యాదానం చేసిన పాఠశాల యాజమాన్యానికి చిన్నారుల తల్లి హర్షిత కృతజ్ఞతలు తెలిపారు.

'22న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి'

కరపత్రాలను విడుదల చేస్తున్న బీసీ సంఘం నాయకులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 19 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.7వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 22న నిర్వహించనున్న చలో కలెక్టరేట్, ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రాందేవ్ అన్నారు. మున్సిపాలిటీలో శనివారం విద్యార్థులతో కలిసి ముట్టడి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనకు డబ్బులుంటాయి కానీ.. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి లేవా? అని ప్రశ్నించారు. వంద రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని, యువతులకు స్కూటీలు, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పిన హామీలు ఎప్పుడో మరిచారని విమర్శించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుండెబోయిన సురేశ్, కడ్తాల శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, సతీశ్, సిద్ధు, నవీన్, లోకేశ్, శివ, నితీశ్, మానస, నివేదిత పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి : ఏఐవైఎఫ్

వలిగొండ, అక్టోబర్ 19 : ఇందిరమ్మ అభివృద్ధి కమిటీలను గ్రామ సభల్లో అఖిల పక్ష నాయకులతో కలిసి ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేశ్ అన్నారు. ఈ మేరకు ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుద్దాల సాయికుమార్‌తో కలిసి ఎంపీడీఓ జితేందర్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ జీఓ 33 ప్రకారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ కమిటీలను అఖిలపక్ష నాయకులతో కలిపి వేయాలన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కమిటీలో అన్ని రాజకీయ పార్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాతగుట్ట చౌరస్తా వద్ద సర్కిల్ ఏర్పాటు చేయాలి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 19 : పట్టణంలోని స్వామివారి వైకుంఠ ద్వారం ముందు నిర్మించిన బ్రిడ్జి అండర్ బైపాస్ సర్వీస్ రోడ్డుకు స్పీడ్ బ్రేకర్లు, పాతగుట్ట చౌరస్తా వద్ద సర్కిల్ ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో రోడ్లు, భవనాల శాఖ ఈఈకి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ బైపాస్ వద్ద స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పాతగుట్ట చౌరస్తా వద్ద సర్కిల్ లేకపోవడంతోపాటు బోర్డులు అడ్డుగా మారడంతో భక్తులు ఎలా వెళ్లాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మండల నాయకులు మాటూరి మల్లయ్య, ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు కంబాల వెంకటేశ్, మధు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తాం

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అసంపూర్తిగా ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 19 : పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను శనివారం ఆయన సందర్శించి మిగిలిన పనులు, నిధులు ఎన్ని కావాలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తికి మరో కోటి రూపాయలు అవసరమున్నాయని, వాటిని త్వరలో విడుదల చేసి మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తామని అన్నారు. మార్కెట్‌లో నిలిచిపోయిన పనులకు ఎస్టిమేట్ వేసి చెప్పాలని మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డికి సూచించారు. ఇందులో పండ్లు, కూరగాయలు, పూలు, నాన్‌వెజ్, కిరాణా షాపులు ఒకేచోట ఉండడంతో ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరం కలిసి మూసీ నది ప్రక్షాళనపై కార్యాచరణ ప్రకటించి క్షేత్రస్థాయిలో పర్యటిస్తామన్నారు. బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. రోడ్ల మరమ్మతులకు ఉపాధి హామీ పథకం, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు జహంగీర్, పోత్నక్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

బొల్లేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 19 : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనాజీపురం, నందనం, బొల్లేపల్లి, సూరేపల్లి, ఆకుతోట బావితండా, పచ్చర్లబోడుతండా గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

గీత కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ

భువనగిరి మండలంలోని అనాజీపురం గ్రామంలో గీత కార్మికులకు ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతుందన్నారు. తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కవచాలు ఎంతగానో తోడ్పడుతాయని చెప్పారు.

షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య

మోత్కూరు, అక్టోబర్ 19 : ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య అన్నారు. మున్సిపాలిటీలోని కేఆర్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15నాటికి రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేటికి 50శాతం మంది రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. జూన్‌లో ఇవ్వాల్సిన రైతు భరోసా అక్టోబర్ అయిపోతున్నా విడుదల చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వానకాలం పంట కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. బునాదిగాని కాల్వ నిర్మాణానికి రూ.266.65కోట్లతో పారిపాలన అనుమతులు ఇచ్చారని, తక్షణమే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జక్క దయాకర్‌రెడ్డి, నాయకులు ఉప్పల కొమురయ్య, ఎలగందుల అంజయ్య, స్వామి, ఎల్లయ్య, దామోదర్‌రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్రారెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 19 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి దొడ్డు రకం ధాన్యానికి కూడా రూ.500 బోనస్ చెల్లించాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెంకిర్యాల గ్రామంలో శనివారం జరిగిన సీపీఎం గ్రామ శాఖ 9వ మహాసభలో ఆయన మాట్లాడారు. వెంకిర్యాల మార్కెట్‌లో 20రోజుల నుంచి రైతులు ధాన్యం రాశులు పోస్తున్నారని, గ్రామంలో తక్షణమే కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేయాలని కోరారు. ఇందిరమ్మ కమిటీలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని, ఇల్లు లేని పేదలను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని అన్నారు. మూసీ సుందరీకరణ చర్యలపై ప్రజలకున్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు.

అనంతరం సీపీఎం గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాదారం శివ కుమార్ ఎన్నికయ్యారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు సయ్యద్ ఉమర్, సుబ్బారెడ్డి, పర్వతాలు, లింగం, ఆంజనేయులు, రాజమణి, సత్తెమ్మ, లక్ష్మణ్, నర్సింహ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ధరించాలి



పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో చేనేత దుస్తులను ధరించిన బ్యాంక్ సిబ్బంది

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 19 : చేనేత దుస్తులను ప్రతిఒక్కరూ ధరించాలని పోచంపల్లి కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ అన్నారు. పట్టణంలోని పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సిబ్బంది శనివారం చేనేత దుస్తులను ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత దుస్తులు హుందాతనంతోపాటు ఆరోగ్యానికి సహకరిస్తాయన్నారు. సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకునేందుకు నేత కార్మికులకు చేయూతనివ్వాలని కోరారు. బ్యాంకు లో ఖాతాదారులందరికీ మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ రచ్చ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'కోలాటం కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి'

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 19 : గ్రామీణ ప్రాంతంలోని కోలాట బృందం మహిళా కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్ అన్నారు. మండలంలోని టి.రేపాకలో శనివారం ఏర్పాటు చేసిన కోలాటం కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేసి పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు కళా ప్రదర్శన కోసం అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఏలేంద్ర, మాధవి, అనూరాధ, రాములమ్మ, మంజుల, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.

టి.రేపాకలో మాట్లాడుతున్న ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

28న తైబజార్ వేలం

భువనగిరి అర్బన్, అక్టోబర్ 19 : భువనగిరి మున్సిపాలిటీలో ఈ ఏడాది నవంబర్ 1నుంచి 2025 మార్చి 31వరకు తైబజార్ వసూలు చేయుటకు ఈ నెల 28న వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ వేలంలో పాల్గొనుటకు మున్సిపాలిటీ పేరుతో రూ.50వేల డీడీ తీసుకుని ఈ నెల 26న సాయంత్రం 5 గంటల్లోపు మున్సిపాలిటీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వేలం పాటను 28న ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు మున్సిపాలిటీ రెవెన్యూ ఆఫీసర్ సెల్ నంబర్ 9441009662లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, బెల్టుల పంపిణీ

వలిగొండ, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని వేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక ముస్తఫా చికెన్ సెంటర్ యజమాని ఎండీ దస్తగిరి సౌజన్యంతో శనివారం పరీక్ష ప్యాడ్లు, ప్రోగ్రెస్ కార్డులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బచ్చు శ్రీనివాస్, పోలెపాక భిక్షపతి, నాగెల్లి వలీ, బత్తిని నగేశ్‌గౌడ్, బత్తిని అరుణ్‌కుమార్ గౌడ్, బుగ్గ ఉదయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

బీబీనగర్, అక్టోబర్ 19 : రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దేవరాయి మహేశ్ (28) కొన్ని రోజులుగా మత్తు పదార్థాలకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం మండల కేంద్రంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బేగంపేట వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సీపీఐ

రాజాపేట, అక్టోబర్ 19 : బేగంపేట వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఇటీవల కలెక్టర్‌కు సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం గత సంవత్సరం నుంచి కొనసాగుతుందని, పనులను ఇష్టానుసారంగా చేస్తున్నారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్, ఇతర అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

పెద్ద పర్వతాపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

బొమ్మలరామారం, అక్టోబర్ 19 : మండలంలోని పెద్ద పర్వతాపూర్ గ్రామంలో శ్రీసాయి విద్యాధామం పాఠశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ మరియు సుమంత్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు కంటి వైద్య నిపుణులు డాక్టరల పోతు కృష్ణ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటిఅద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోసాయిధామం పీఠాధిపతి శ్రీ రామానంద ప్రభూజీ, రోటరీ క్లబ్ సభ్యులు ఉపేందర్,సద్ది వెంకట్‌రెడ్డి, రాజేష్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలి : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 19 : ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకుడు కోట రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు 60 శాతం ధాన్యాన్ని తీసుకొచ్చి మార్కెట్ యార్డుల్లో పోశారని, వెంటవెంటనే కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని స్థలం లేక తక్కువ రేటుకు రైస్ మిల్లులకు అమ్ముకొని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, మంచాల మధు, శివ, యాదగిరి పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

సిరిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, అక్టోబర్ 19 : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి పోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్రమ్మ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు రాజిరెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మీనర్సు, మహేందర్‌రెడ్డి, పృథ్వీరాజ్, బాలనర్సయ్య, జమీరొద్దీన్, శేఖర్, సాయికుమార్ పాల్గొన్నారు.

వెంకటయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

లక్ష్మి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 19 : బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు మిట్ట వెంకటయ్య తల్లి లక్ష్మి అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లిలో లక్ష్మి భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. సునీత వెంట బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ సర్పంచ్‌లు పల్లెపాటి బాలయ్య, సిరికొండ సత్యనారాయణ, నాయకుడు శ్రీనివాస్ ఉన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 19 : ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన సీపీఎం మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం, రూ.4వేలకు పింఛన్ల పెంపు, మహిళలకు నెలకు రూ.2500 అందజేస్తామని వాగ్దానాలు చేసి అమలు చేయకుండా మోసం చేయడం సరికాదన్నారు. ఇందిరమ్మ కమిటీలను గ్రామసభల ద్వారా రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో సీపీఎం ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం, మండల కార్యదర్శి వేముల భిక్షం, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ముత్యాలు, నాయకులు జయరాములు, గోపాల్‌రెడ్డి, గోవర్ధన్, సత్తయ్య, యాదయ్య, యాదిరెడ్డి, పాల్గొన్నారు.

మురుగు కాల్వ సమస్య పరిష్కరించాలని వినతి

పంచాయతీరాజ్ డీఈ మంగులాల్, ఎంపీడీఓ రాములునాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న శాంతినగర్ కాలనీవాసులు

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో మురుగు నీటి కాల్వ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు శనివారం పంచాయతీరాజ్ డీఈ మంగులాల్, ఎంపీడీఓ రాములునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని వివిధ వాడల నుంచి వచ్చే మురుగు నీరు శాంతినగర్ డ్రైనేజీలో చేరడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీటికి దారి చూపించి శిథిలమైన ఇండ్లను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన అధికారులు మురుగు నీటి కాల్వను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సతీశ్, పావని, కోటేశ్వరి, వైష్ణవి, రజిత, బాబు ఉన్నారు.

విద్యార్థులు దురలవాట్లకు బానిస కావద్దు

సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ కె.రజనీకర్

ఆలేరు టౌన్, అక్టోబర్ 19 : విద్యార్థులు మద్యానికి, ధూమపానానికి, డ్రగ్స్ వంటి దురలవాట్లకు బానిసలు కావద్దని ఆలేరు ఎస్‌ఐ కె.రజనీకర్ అన్నారు. బాల్య వివాహాలు, డ్రగ్స్‌పై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుపై, తమ భవిష్యత్‌పై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు, చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు శ్రీహరి బాబు, స్వప్న, నందిని, సురేశ్, అధ్యాపకులు రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జూకంటి వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు వెంకటేశ్ ఎంపిక

దూడల వెంకటేశ్

ఆలేరు టౌన్, అక్టోబర్ 19 : మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా, ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న దూడల వెంకటేశ్ టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఈ నెల 20న అవార్డు ప్రదానం చేయనున్నట్లు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంటటేశ్‌కు పాఠశాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

ఆలేరు టౌన్, అక్టోబర్ 19 : అర్హులైన ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. ఆలేరు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను శనివారం కలిసి ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తపస్ బాధ్యులు దూడల వెంకటేశ్, ప్రధానోపాధ్యాయులు దాసరి మంజుల, సత్యానారాయణరెడ్డి, ఉపాధ్యాయులు నరేంద్రస్వామి, సైదులు, పరమేశ్, మల్లేశం, రోషిణి, రాధిక, హేమలత, ప్రసూన, సుజారాణి, శ్రీధర్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.